ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి గెలుపు కోసం సమన్వయంతో పని చేయాలి సీఎం రేవంత్ రెడ్డి

2లో..

సంపుటి: 1 | సంచిక: 351 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 27 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు

## కవితకు జ్యూడీషియల్ రిమాండ్

### తీహార్ జైలుకు ఎమ్మెల్సీ కవిత

న్యూఢిల్లీ, మార్చి 26 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మంగళవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు 15 జ్యూడీషియల్ రిమాండ్ విధించింది ట్రయల్ కోర్టు. ఏప్రిల్ 9 వరకు జ్యూడీషియర్ రిమాండ్ విధించింది. దీంతో ఆమెను తీహార్ జైలుకు అధికారులు తరలించనున్నారు. లిక్కర్ స్కాం కేసులో కస్టడీ ముగియడంతో ఈడీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టారు. ఈడీ జ్యూడీషియల్ కస్టడీ కోరగా.. అదే సమయంలో కవిత వేసిన బెయిల్ పిటిషన్‌పైనా వాదనలు జరిగాయి. అయితే.. ఈడీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు ఆమెకు జ్యూడీషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. "సమాజంలో కవిత చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి. ఆమెను విడుదల చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. సాక్షాధారాలను ధ్వంసం చేసే అవకాశం ఉంది. దీనివల్ల దర్యాప్తుకు తీవ్ర విఘాతం కలుగుతుంది. లిక్కర్ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. కవిత పాత్రకు సంబంధించి ఇంకా లోతైన దర్యాప్తు చేస్తున్నాం. అక్రమ సొమ్ము గుర్తించే పనిలో ఉన్నాం. ఆర్థిక నేరాల దర్యాప్తు చాలా కఠినమైనది. ఆర్థిక

..మిగతా 2లో

నేడు కాంగ్రెస్ అభ్యర్థుల

# ఫైనల్ లిస్ట్

## మిగిలిన 8 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనున్న కాంగ్రెస్


### ఖర్గే అధ్యక్షతన భేటీ కానున్న కేంద్ర ఎన్నికల కమిటీ

### సర్వేల నివేదికలు, పార్టీ విధేయత ఆధారంగా ఇప్పటికే నిర్ణయం



న్యూఢిల్లీ, మార్చి 26 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో మిగిలిన 8 లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ అధిష్టానం బుధవారం అభ్యర్థుల్ని ఖరారు చేయనుంది. ఇందుకోసం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) మరోమారు భేటీ కానుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో పార్టీ మాజీ చీఫ్‌లు సోనియాగాంధీ, రాహుల్‌తో పాటు కమిటీ సభ్యులు కేసీ వేణుగోపాల్, అంబికాసోనీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అలాగే సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు పాల్గొననున్నారు. 8 స్థానాలకు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర, జిల్లా నేతలు, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేల అభి ప్రాయాలను ఏఐసీసీ స్వీకరించింది. వారిచ్చిన సూచనలు, సలహాల మేరకు ఆశావహుల అభ్యర్థి త్వాలను పరిశీలించి తుది జాబితాను సీఈసీకి పంపింది. ప్రజల్లో బలం, కుల సమీకరణలు, పార్టీకి చేసిన సేవల ఆధారంగా అభ్యర్థుల పేర్లను నేతలు సిఫారసు చేశారు. కాగా సీఈసీ వివిధ సర్వేల నివేదికలు, పార్టీ విధేయత ఆధారంగా అభ్యర్థులపై ఇప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి తొలి నుంచి మాజీ ఎమ్మెల్యే ఎ.ప్రవీణ్‌రెడ్డి పేరు పరిశీలనలో ఉన్నప్ప టికీ, అక్కడే బీజేపీ నుంచి బండి సంజయ్, బీఆర్ఎస్ నుంచి వినోద్‌కుమార్ పోటీలో ఉన్న నేపథ్యంలో అక్కడ మరో అభ్యర్థిని పరిశీలించాలని ఏఐసీసీ సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తీన్మార్ మల్లన్న పేరును తెరపైకి తెచ్చి నట్లు సమాచారం. ఇప్పటికే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, ఇతర రాష్ట్ర నేతలను కలిసిన మల్లన్న కరీంనగర్

..మిగతా 2లో



'మహాఘట్ బంధన్'లో

## సీట్ల చిచ్చు..

### కోరుకున్న స్థానాలపై లాలూ పేచీ

న్యూఢిల్లీ, మార్చి 26 (ప్రభాత ఉదయం): త్వరలో జరగనున్న బీహార్‌లోని ఐదు అసెంబ్లీ నియోజక వర్గాల సీట్ల కేటాయింపుల్లో మహాఘటబంధన్ కూటమిలో ప్రతిష్టంభన నెలకొన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ), లెఫ్ట్ పార్టీలు పొత్తు కుదుర్చుకున్నాయి. ఎన్నికల బరిలోకి దిగనున్నాయి. అయితే, లోక్‌సభ సీట్లను కేటాయించినట్లుగా అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల ఎంపిక విషయంలో ఏకాభిప్రాయానికి రావడం లేదని, ఫలితంగా నేతల మధ్య విభేదాలు తలెత్తినట్లు సమాచారం. బీహార్ అసెంబ్లీ నియోజవర్గాలైన ఔరంగాబాద్, బెగుసరాయ్, కతిహార్, పూర్ణియా, శివన్ స్థానాల్లో కూటమి పార్టీల మధ్య మనస్పర్ధలు చోటు చేసుకున్నాయి. ఔరంగాబాద్‌తో పాటు బెగుసరాయ్ సీటులోనూ కాంగ్రెస్, ఆర్జేడీ మధ్య వివాదం నెలకొంది. ఇటీవల సీపీఐ సీట్ల కేటాయింపులో కూటమిలోని పార్టీ పెద్దల్ని సంప్రదించ కుండానే ఔరంగాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా అవదేశ్ రాయ్‌ను ప్రకటించింది. శివన్ బీహార్ అసెంబ్లీ మాజీ స్పీకర్ అవధ్ బిహారీ చౌదరికి టికెట్ ఇవ్వాలని లాలూ ప్రసాద్ ఆర్జేడీ డిమాండ్ చేస్తోంది. సీపీఐ, సీపీఐ(ఎంఎల్)లు కూడా శివన్ సీటు కోసం ప్రయత్నిస్తున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. కతిహార్ నియోజకవర్గం నుంచి తారిఖ్ అన్వర్‌ను పోటీకి దింపాలని కాంగ్రెస్ భావిస్తుంటే.. అదే సీటు తమకే కావాలంటూ ఆర్జేడీ పట్టుబడుతుంది. దీంతో అసెంబ్లీ సీట్ల కోసం అయా పార్టీల నేతల సిగపట్లతో కార్యకర్తలు విస్తుపోతున్నారు.

## పార్టీ ఫిరాయించిన రంజిత్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలి: సబితా



కసి, బాధ్యతతో పనిచేసి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి

బీఆర్ఎస్ కేడర్ కష్టంతో ఎంపీలైన రంజిత్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డిలు పార్టీకి మోసం చేసి బయటకు వెళ్లారు

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కంటే..బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అందరివాడు: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలవి ఆక్రందనలే

తెలంగాణలో కేసీఆర్ నిషానా లేకుండా చేయడం ఎవరితరం కాదు:మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నన్ను గెలిపిస్తే సామాన్యులకు అందుబాటులో ఉండి పార్లమెంటులో చేవెళ్ల వాణిని వినిపిస్తా:కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ వెల్లడి

2

ఫోన్ ట్యాపింగ్ కేసుతో

## సంబంధం లేదు

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావ్



హైదరాబాద్,మార్చి 26 (ప్రభాత ఉదయం): ఫోన్ ట్యాపింగ్ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి, భారాస నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు తనకు తెలియదని చెప్పారుహైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రణీత్‌రావు బంధువులు తమ ఊరిలో ఉన్నారని.. వారికి ఏ పార్టీతో సంబంధం ఉందో విచారణ చేస్తే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. పార్టీ మారాలంటూ కొందరి ద్వారా తనపై ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. తెదేపాలో ఉన్నప్పుడూ తెలంగాణ కోసం పోరాడానన్న ఎర్రబెల్లి.. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తనపై ఎలాంటి మచ్చ లేదని చెప్పారు. ఇరికించాలని ఎన్నో ప్రభుత్వాలు ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. ఇబ్బంది పెట్టాలనే తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారని ఆక్షేపించారు. తనపై ఫిర్యాదు,

..మిగతా 2లో



తాగునీటి సరఫరాపై

## ఆందోళన పడవద్దు

### సీఎస్ శాంతి కుమారి

హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం): గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడ రాష్ట్రంలోని మూడు ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉన్నందున ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఏ విధమైన ఇబ్బందులు లేవని సీఎస్ శాంతి కుమారి స్పష్టం చేశారు.రాష్ట్రంలో తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే "సమ్మర్ యాక్షన్ ప్లాన్" ను రూపొందించి జిల్లాలకు తగు నిధులను కూడా విడుదల చేయడం జరిగిందని తెలిపారు.రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు ఏవిధమైన ఆందోళన చెందాల్సిన అవసరంలేదని. ఇప్పటికే బోరు బావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులు చేపట్టడం పూర్తి చేయడం జరిగిందని చెప్పారు అయితే, నిర్వహణ పరమైన లోపాలను ఎప్పటికప్పుడు వెంటనే సవరించి నిరంతర నీటి సరఫరాకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు సూచించారు.ప్రతీ రోజు గ్రామాలు, పట్టణాలలో తాగు నీటి సరఫరాపై సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులు, నోడల్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలని తెలియచేసారు. వేసవి

..మిగతా 2లో



## సంక్షేమ పథకాలేవీ ఆగవ్..

### ఆ రూమర్స్ నమ్మొద్దు: ఢిల్లీ సర్కార్ విజ్ఞప్తి

### ఈడీ కస్టడీ నుంచి కేజ్రీవాల్ రెండో ఆదేశాలు..

న్యూఢిల్లీ, మార్చి 26 (ప్రభాత ఉదయం): ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో నెలకొన్న పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొన్ని శక్తులు చేస్తోన్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని ఆప్ సర్కార్ ఢిల్లీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్లానింగ్ డిపార్టుమెంట్

..మిగతా 2లో

## త్వరలో పంటల పరిశీలనకు కేసీఆర్



### బోర్లు వేసి నష్టపోయిన ముషంపల్లి నుంచి షురూ

### భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో పర్యటన

### రూట్‌మ్యాప్ ఖరారు చేసే బాధ్యత జగదీశ్‌రెడ్డికి

హైదరాబాద్, మార్చి 26 (ప్రభాత ఉదయం): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన పంట నష్టాన్ని పరిశీలించేందుకు బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. సాగునీరు అందక భూగర్భ జలవనరులు కూడా అడుగంటిన పరిస్థితిలో రైతులతో ప్రత్యక్షంగా భేటీ కావాలని కేసీఆర్ భావిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్య టనలో భాగంగా భువనగిరి, ఆలేరు నియోజక వర్గాల్లో పంట పొలాలను

..మిగతా 2లో

# పార్టీ ఫిరాయించిన రంజిత్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలి








రాజేంద్రనగర్, మార్చి 26 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు అన్నిరకాలుగా లబ్ధి పొంది అధినేత కేసీఆర్,పార్టీ ఇబ్బందుల్లో ఉన్న కష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన చేవెళ్ళ ఎంపీ రంజిత్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బడుగు,బలహీనవర్గాల గొంతుకగా,జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎంతో సేవ చేసిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను కసితో,బాధ్యతతో పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించుకొని మోసం చేసిన వారికి తగిన బుద్ధి చెప్పి కేసీఆర్ రుణం తీర్చుకోవాలని సూచించారు.చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల సన్నాహాక ప్రక్రియలో భాగంగా బుధవారం నార్సింగీలోని ఓమ్ కన్వెన్షన్ సెంటర్లో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్,చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,ఎమ్మెల్సీలు సురబీ వాణీదేవి,ఎగ్గె మల్లేశం,బొగ్గారపు దయానంద్,నార్సింగీ,శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్లు,జడ్పీటీసీలు,ఎంపీపీలు,ఎంపీటీసీలు,జిల్లా,మండల, మున్సిపల్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి,సంక్షేమమే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ ఎస్ అభ్యర్థుల గెలుపుకు దోహదపడుతుందన్నారు.చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని మహేశ్వరం,రాజేంద్రనగర్,శేరిలింగంపల్లి నియోజకవర్గాలను కేసీఆర్,కేటీఆర్‌లు ఊహించని స్థాయిలో అభివృద్ధి చేశారని,అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు రాజధాని,నగర శివారు ప్రాంతాల్లో అన్ని సీట్లలో బీఆర్ ఎస్‌కు పట్టం కట్టారని గుర్తుచేశారు.గత పదేళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో,సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 100 రోజుల్లోనే రైతాంగం,ప్రజానీకం ఎన్ని అగచాట్లు పడుతున్నారో అందరికీ తెలుసన్నారు.ఎలాంటి రాజకీయ అనుభవం లేకపోయినా కేవలం కేసీఆర్ దయతో,బీఆర్ఎస్ కార్యకర్తల కష్టంతో కారు గుర్తుపై చేవెళ్ల ఎంపీలుగా గెలిచిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి,రంజిత్‌రెడ్డి పార్టీ ఫిరాయించారన్నారు.పార్టీకి మోసం చేసిన వారిద్దరే ఇప్పుడు బీఆర్ ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ప్రత్యర్థులుగా బీజేపీ,కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారని తెలిపారు. తనను గెలిపించిన బీఆర్ఎస్ పార్టీపై,కేడర్‌పై నమ్మకం లేదని,ప్రజలు మన పార్టీ వైపు లేరని భావించి కాంగ్రెస్‌లోకి వెళ్లి మరలా పార్లమెంటుకు పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి ఓటు దెబ్బతో గట్టి గుణపాఠం చెప్పాల్సిన గురుతర బాధ్యత పార్టీ కేడర్‌పై ఉందన్నారు.పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో అన్నివిధాలా అందరికీ ఆమోదయోగ్యుడైన బడుగు,బలహీన వర్గాల నేత కాసాని జ్ఞానేశ్వర్ ను ప్రతి కార్యకర్త ఛాలెంజ్‌గా తీసుకొని కష్టపడి పని చేసి గెలిపించుకోవాలని సూచించారు.ఉమ్మడి రాష్ట్రంలో 96 బీసీ కులాలను ఏకం చేసి వారి హక్కుల కోసం అహర్నిషలు క్రషి చేస్తూ అన్నివర్గాలను గుండెలో పెట్టుకొని అందరివాడుగా,రాజకీయ అజాత శత్రువుగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల పార్లమెంటు ఓటర్లు మద్దతు తప్పనిసరిగా ఉంటుందన్నారు.చేవెళ్ల పార్లమెంటుపై వరుసగా మూడోసారి గులాభీ జెండా ఎగరడం ఖాయమని,బడుగు,బలహీనవర్గాల ప్రజలంతా ఒక్కటై తమ నేత జ్ఞానేశ్వర్ ను గెలిపించుకుంటే పార్లమెంటులో బీసీల గొంతుకగా పనిచేస్తారని సబితారెడ్డి పేర్కొన్నారు.కేసీఆర్ కుటుంబాన్ని బద్‌నామ్ చేయడమే కాంగ్రెస్ లక్ష్యం..తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం,అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా అవినీతి పేరిట కేసీఆర్‌ను,ఆయన కుటుంబాన్ని బద్‌నామ్ చేయడమే పనిగా పెట్టుకుందని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ నిషానా లేకుండా చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతు బంధు, కళ్యాణ లక్ష్మి లాంటి ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకంలోనూ కేసీఆర్ కనిపిస్తారని పేర్కొన్నారు.కేసీఆర్ నిషానా లేకుండా చేయాలంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రద్దు చేయాల్సి ఉంటుందని, ఆ దమ్ము ముఖ్యమంత్రికి ఉందాస అని సవాల్ చేశారు.కేసీఆర్ ఊసు లేని తెలంగాణను ఊహించుకోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మార్పు వస్తుందని అనుకుంటే కరెంట్ కోతలు,తాగునీటి కష్టాలు,ఎండిన పోలాలతో ప్రజలు,రైతులు విలవిలలాడుతున్నారని సబితారెడ్డి మండిపడ్డారు. 3 నెలలు దాటినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,మంత్రులు కీలకమైన ప్రజా సమస్యల పరిష్కారంపై,పాలనపై తక్షణమే దృష్టి పెట్టకుండా ఇంకా రాజకీయ కుట్రలు,పార్టీల ఫిరాయింపులకు ప్రాధాన్యత ఇవ్వడం దారుణమన్నారు.యాసంగి పంటలకు సాగునీటి పంపిణీని కాంగ్రెస్ సర్కారు గాలికొదిలేసిన ఫలితంగా ప్రాజెక్టుల నుండి రైతుల పోలాలకు పారాల్సిన నదీ జలాలు సముద్రం పాలయ్యాయని విమర్శించారు.రాజకీయ ఫిరాయింపులకు కాంగ్రెస్ గేట్లు తెరుస్తామంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రాజెక్టుల గేట్లు తెరిచి సాగునీటిని వదలి పెట్టి పంటలు ఎండిపోకుండా రైతాంగాన్ని ఆదుకోవాలని సబితారెడ్డి డిమాండ్ చేశారు.

### వంద రోజుల్లోనే కాంగ్రెస్ పాలనపై జనాగ్రహం -ఎంపీగా గెలిస్తే చేవెళ్ల సమస్యలపై గొంతెత్తుతా: కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తెలంగాణ రాష్ట్రం త్వరితగతిన అభివృద్ది చెంది దేశానికే దిక్సూచిగా నిలిచిందని చేవెళ్ల పార్లమెంటు బీఆర్ ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. సంక్షేమంలో వినూత్న పథకాలతో దేశంలో మొదటి స్థానంలో ఉందని,తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎంతో మంచి జరిగిందన్నారు.గత పదేళ్లలో ప్రభుత్వ పనితీరుతో ప్రజలు అన్నిరకాలుగా సంతోషంగా ఉండగా,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే రైతాంగానికి, సామాన్య ప్రజలకు,యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు.24 గంటల కరెంటు,రైతు బంధు,రైతు భీమా,రుణ మాఫీ,కళ్యాణ లక్ష్మీ,ఫించన్ల పెంపుపై ప్రజలకిచ్చిన గ్యారెంటీలపై కాంగ్రెస్ సర్కారు మోసం చేస్తోందని విమర్శించారు.అధికారంలో రావాలనే అమలు సాధ్యం కాని గ్యారెంటీలను ఇచ్చి తీరా పవర్‌లోకి వచ్చాక ఆదాయ వనరుల్లేవని కేసీఆర్ ప్రభుత్వంపై సాకులు చూపెట్టడం ప్రజలను మోసం చేయడమేనన్నారు.ప్రస్తుత తాజా కరవు పరిస్థితులు,పాలనా అనుభవం లేకపోవడం వల్ల తిరోగమన విధానాలతో రాష్ట్ర అభివృద్ధి మందగించి ఇబ్బందులు పడుతున్న ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేక ఓటుతో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు.చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థుల రాజకీయ చరిత్ర,అనుభవం,పనితీరును ప్రజలు నిశితంగా గమనించి ఓటు వేయాలని సూచించారు.96 బీసీ కులాల ఐక్యతకు,వారి హక్కుల సాధనకు సుధీర్ఘ కాల పోరాటం చేస్తూనే మరోవైపు జడ్పీ చైర్మన్‌గా,ఎమ్మెల్సీగా రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు.గత ప్రభుత్వం చేసిన మంచి పనులను,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరించి పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ ఎస్ విజయానికి నెల రోజులు కష్టపడి సమన్వయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.కేసీఆర్ చలువతో ఎంపీగా గెలిచి ఆయన కష్టకాలంలో ఉన్నపుడు పార్టీని విడిచి వెళ్లిన వారిని ఓడించడానికి పార్టీ కేడర్ దీక్షపూని చేవెళ్ల ఎంపీ సీటుపై కేసీఆర్ పెట్టుకున్న ఆశలు వమ్ము కాకుండా పార్టీ నాయకులు కార్యక్షేత్రంలో ముందుండి పార్టీ కేడర్‌ను లక్ష్యం వైపు నడిపించాలని పిలుపునిచ్చారు.బడుగు, బలహీనవర్గాల బిడ్డగా తనను ఎంపీగా గెలిపిస్తే సామాన్యులకు అందుబాటులో ఉండి చేవెళ్ల పార్లమెంటు ప్రాంత సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తానని కాసాని జ్ఞానేశ్వర్ స్పష్టం చేశారు.




# చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి గెలుపు కోసం సమన్వయంతో పని చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 26(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి రంజిత్ రెడ్డి గెలుస్తాడని అన్ని సర్వేలు చెబుతున్నాయని అందుకోసం పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి భారీ మెజార్టీతో రంజిత్ రెడ్డి గెలిపించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వగృహంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ సమన్వయ నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలిచే విధంగా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేసే గెలిపించాలన్నారు. గండిపేట మండలానికి చెందిన రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ ఫెడరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ముంగి జైపాల్ రెడ్డి లు సీఎం రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గండిపేట మండలంలోని నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలలో గల పలు సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

# పాక్‌లో ఆత్మాహుతి దాడి

## ఐదుగురు చైనా పౌరుల మృతి



పాకిస్థాన్, మార్చి 26 (ప్రభాత ఉదయం): పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఖైబర్ పక్తుంక్వా ప్రావిన్స్‌లో చోటు చేసుకున్న ఈ ఆత్మాహుతి దాడిలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. మరణించినవారిలో ఐదుగురు చైనా జాతీయులు ఉన్నారు. ఇస్లామాబాద్ నుంచి దసు ప్రాంతంలోని తమ క్యాంపునకు చైనా ఇంజినీర్ల బృందం వెళుతుండగా ఈ ఆత్మాహుతి దాడి జరిగింది. ఖైబర్ పక్తుంక్వా ప్రావిన్స్ లోని బిషమ్ తెహ్సిల్ వద్ద చైనా ఇంజినీర్ల కాన్వాయ్ వెళుతుండగా, ఓ ఆత్మాహుతి దళ సభ్యుడు పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఐదుగురు చైనా ఇంజినీర్లు, వారి వాహనం డ్రైవర్ గా ఉన్న ఓ పాకిస్థానీ జాతీయుడు మరణించినట్టు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా, పేలుడు ధాటికి చైనా ఇంజినీర్ల వాహనం రోడ్డు పై నుంచి పక్కనే ఉన్న ఓ గోతిలోకి ఎగిరిపడిందని, అనంతరం మంటల్లో చిక్కుకుందని పోలీసులు వివరించారు. ఈ ఆత్మాహుతి దాడి ఘటనను పాకిస్థాన్ దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తీవ్రంగా ఖండించారు. చైనా పౌరులు మృతి చెందడం పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ వ్యతిరేక శక్తులు ఎన్నటికీ పాకిస్థాన్-చైనా స్నేహాన్ని దెబ్బతీయలేవని జర్దారీ ఉద్ఘాటించారు. కాగా, ఈ ఆత్మాహుతి దాడికి తమదే బాధ్యత అని ఇంకా ఏ ఉగ్రవాద సంస్థ కూడా ప్రకటన చేయలేదు.

# సంక్షేమ పథకాలేవీ ఆగవ్..

మొదటి పేజీ తరువాయి...

ఓ ప్రకటన విడుదల చేసింది. కేజ్రీవాల్ అరెస్టుతో దిల్లీలో అమలవుతోన్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు నిలిచిపోతాయంటూ స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు చేస్తోన్న దుష్ప్రచారంపై ప్రజల్ని అప్రమత్తం చేసింది. నేర పరిశోధన ప్రక్రియలో చట్టం తన పని తాను చేస్తుందని.. పథకాల అమలు, పాలన అనేవి ఎప్పుడూ వ్యక్తులకు సంబంధించినవి కావని స్పష్టం చేసింది. సామాన్య ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని ప్లానింగ్ విభాగం కార్యదర్శి నిహారికా రాయ్ ప్రకటనలో తెలిపారు. అయితే, సీఎం కేజ్రీవాల్ ఆదేశాల మేరకే ఈ ప్రకటన వెలువడినట్లు ఆప్ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో మాదిరిగానే ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు, రాయితీలు, పింఛన్లు తదితర సేవలన్నీ నిరాటంకంగా కొనసాగుతాయని నిహారిక స్పష్టంచేశారు. ప్రజా సంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయింపులతో సంఘటిత నిధి ద్వారా ప్రజాధనాన్ని ఖర్చు చేస్తారని, ఈ డబ్బు ఒక వ్యక్తి లేదా రాజకీయ పార్టీల సొంత ఆస్తులు కాదన్నారు. అందువల్ల ముఖ్యమంత్రి అరెస్టు లేదా రిమాండ్‌తో ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై అస్సలు ప్రభావమేమీ ఉండదని పేర్కొన్నారు. కొన్ని స్వార్థపూరిత శక్తులు చేసే ఇలాంటి తప్పుదారి పట్టించే సమాచారాన్ని నమ్మొద్దని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను ఈ నెల 21న రాత్రి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 28వరకు ఆయన ఈడీ కస్టడీలో ఉండనున్నారు.

# బీజేపీ ఆరో జాబితా విడుదల




న్యూఢిల్లీ, మార్చి 26 (ప్రభాత ఉదయం): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులతో కూడిన ఆరో జాబితాను బీజేపీ మంగళవారం విడుదల చేసింది. ఈ జాబితాలో రాజస్థాన్, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు అభ్యర్థులకు చోటు కల్పించింది. రాజస్థాన్‌లోని దౌసా నియోజకవర్గం నుంచి కన్హయ్య లాల్ మీనా, కరౌలీ-ధోల్పూర్ నుంచి ఇందూ దేవి జాటవ్‌లను బరిలో నిలిపింది. ఇక రాజస్థాన్‌లో 25 లోక్‌సభ స్థానాలుండగా ఏప్రిల్ 19న తొలి దశలో 12 స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. మిగిలిన 13 స్థానాల్లో ఏప్రిల్ 26న రెండో దశలో పోలింగ్ జరుగుతుంది. ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ స్థానం నుంచి బసంత కుమార్ సింగ్ పేరును బీజేపీ ఈ జాబితాలో ప్రకటించింది. మణిపూర్‌లో ఏప్రిల్ 19, 26 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. మరోవైపు కాంగ్రెస్ రాజస్థాన్, తమిళనాడు నుంచి పోటీ చేసే ఐదుగురు అభ్యర్థులతో సోమవారం ఆరో జాబితాను విడుదల చేసింది. దీంతో కాంగ్రెస్ ఇప్పటివరకూ 190 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించగా, బీజేపీ ఇప్పటివరకూ 405 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను వెల్లడించింది. కాగా 543 లోక్‌సభ నియోజకవర్గాలకు ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో పోలింగ్ జరగనుంది. దేశవ్యాప్తంగా దాదాపు 97 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

## ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు

# కవితకు జ్యూడీషియల్ రిమాండ్

మొదటి పేజీ తరువాయి...

నేరస్తులు చాలా వనరులు, పలుకుబడి ఉన్నవారు. పథకం ప్రకారం ప్రణాళికతో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. అందుకే దర్యాప్తు అనేది చాలా జఠిలమైనది. ఇందుకోసమైనా కవితను జ్యూడిషియల్ కస్టడీ కి పంపాలి" ఈడీ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం.. ఏప్రిల్ 9వ తేదీ దాకా కవితకు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. అలాగే.. కవిత బెయిల్ పిటిషన్‌పై మరోసారి వాదనలు వినాల్సి ఉందని చెబుతూ.. ఏప్రిల్ 1వ తేదీకి ఆ మధ్యంతర బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా వేసింది. తన పిల్లలకు పరీక్షలు ఉన్నాయని.. మధ్యంతర బెయిల్ అయినా మంజూరు చేయాలని కవిత బెయిల్ పిటిషన్ ద్వారా అభ్యర్థించారు. అయితే.. కేసు దర్యాప్తు పురోగతి లో ఉందని, పలువురు నిందితులను ఇంకా ప్రశ్నిస్తున్నట్లుగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు ఈడీ తరఫు న్యాయవాది జోయబ్ హుస్సేన్. ఇక విచారణ సందర్భంగా.. కోర్టు ప్రాంగణంలో కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగానే తనపై కేసు పెట్టారని అన్నారామె. అదే సమయంలో ఆమె తన భర్త అనిల్, బంధువులను కలిసి మాట్లాడేందుకు ఈడీ అనుమతించింది.

### అప్రూవర్‌గా మారను.. క్లీన్‌గా బయటకొస్తా: కవిత

మరోవైపు లిక్కర్ స్కాం కేసులో ఇంకో కీలక పరిణామం చోటు చేసుకుంది. కవిత మేనల్లుడు మేకా శరణ్‌ను ఈడీ విచారణ చేపట్టింది. లిక్కర్ స్కాం కేసులో అక్రమ సొమ్ము బదిలీలో శరణ్ కీలక పాత్ర పోషించారని ఈడీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో.. శరణ్‌ను కూడా అరెస్ట్ చేస్తారనే ప్రచారం నడుస్తోంది.

## త్వరలో పంటల

# పరిశీలనకు కేసీఆర్

మొదటి పేజీ తరువాయి...

పరిశీలించి రైతులతో భేటీ అవుతారు. ఏప్రిల్ మొదటి వారంలో కేసీఆర్ పర్యటన ఉంటుందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మంగళవారం మీడియా ప్రతినిధులకు సూచనప్రా యంగా చెప్పారు. అత్యధికంగా బోర్లు వేసి నష్టపోయిన ముషంపల్లి నుంచి ఈ పర్యటన ప్రారంభమయ్యేలా కేసీఆర్ పర్యటన షెడ్యూలు ఉండే అవకాశముంది. కేసీఆర్ పర్యటన షెడ్యూ ల్‌తోపాటు రూట్‌మ్యాప్ ఖరారు చేసే బాధ్యతను జగదీశ్‌రెడ్డికి అప్పగించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఖరారైన నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా మంగళవారం భేటీలు ప్రారంభమయ్యాయి. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నేతలతో సోమవారం రాత్రి మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో కీలక భేటీ జరగ్గా, మంగళవారం ఉదయం సికింద్రాబాద్ నేతలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. నల్లగొండ నియోజకవర్గ నేతల సమన్వయ భేటీ కూడా జగదీశ్‌రెడ్డి నివాసంలో మంగళవారం రాత్రి జరిగింది. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో బుధవారం తెలంగాణ భవన్‌లో భేటీ జరగనుంది. ఈ భేటీకి కేటీఆర్ హాజరవుతారు. ఇదిలాఉంటే మెదక్, చేవెళ్ల, పెద్దపల్లి తదితర లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోనూ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సమావేశాలు ప్రారంభమయ్యాయి.

## తాగునీటి సరఫరాపై

# ఆందోళన పడవద్దు

మొదటి పేజీ తరువాయి...

కాల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా మంజూరు చేసిన పనులన్నీ సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు.ఇతర రాష్ట్రాలలో ఎదురవుతున్న తాగునీటి సమస్యను మన రాష్ట్రానికి కూడా అన్వయిస్తూ ఆందోళనకరమైన వార్తా కథనాలు వస్తున్నాయి, అయితే, రాష్ట్రంలో ఈసారి లోటు వర్షపాతం ఉన్నా, %హా=ూా%, శ్రీపాద ఎల్లంపల్లి, నాగార్జున సాగర్ జలాశయాలలో గత సంవత్సరం మాదిరిగానే నీటి మట్టాలున్నందున ఆందోళన అవసరంలేదు: సీఎస్.అయినప్పటికీ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను రూపొందించుకోవాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. కొన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిర్వహణపరంగా లోపాలొచ్చాయి, ఈ లోపాలను వెంటనే పరిష్కరించడం జరిగింది. నీటి సమస్యలపై వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి: సీఎస్.ఏప్రిల్ రెండవ వారం అనంతరం రిజర్వాయర్ల నుండి ఎమర్జెన్సీ పంపింగ్ ను చేపడతామని సీఎస్ తెలియచేసారు. హైదరాబాద్ మహానగరంలో కూడా సరిపడా నీటి సరఫరా చేస్తున్నామని, అయితే, కమర్షియల్ అవసరాల నిమిత్తం డిమాండ్ ఎక్కువగా ఉందని జలమండలి అధికారులు తెలిపారు.రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ దాన కిషోర్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ సందీప్ కుమార్ సుల్తానియా, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి తదితర అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.





# కేజ్రీవాల్ అరెస్టుపై స్పందించిన అమెరికా

న్యూఢిల్లీ, మార్చి 26 (ప్రభాత ఉదయం): మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకుంది. దీనిపై తాజాగా అమెరికా నుంచి స్పందన వచ్చింది. భారత్‌లోని ప్రతిపక్ష నేత అరెస్టుకు సంబంధించిన నివేదికలను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఈ కేసులో పారదర్శక విచారణను ప్రోత్సహిస్తున్నామని పేర్కొంది. కేజ్రీవాల్ అరెస్టుపై ఈ-మెయిల్‌లో అడిగిన ఓ ప్రశ్నకు యూఎస్ అధికార ప్రతినిధి బదులిస్తూ.. "సమయానుకూల, పారదర్శక న్యాయప్రక్రియ జరుగుతుందని ఆశిస్తున్నాం" అని వెల్లడించారు. ఇదిలా ఉంటే.. ఈ అంశంపై ఇటీవల జర్మనీ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఓ ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. "భారత్ ప్రజాస్వామ్య దేశం. ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ న్యాయపరమైన, నిష్పాక్షికమైన విచారణకు అర్హులు. అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాలను ఎలాంటి పరిమితులు లేకుండా ఆయన వినియోగించుకోవచ్చు" అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జర్మనీ స్పందనపై కేంద్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దిల్లీలోని ఆ దేశ రాయబారికి సమన్లు పంపింది. దాంతో జర్మనీ ఎంబసీ డిప్యూటీ హెడ్ జార్జ్ ఎంజ్‌వీలర్ కేంద్ర విదేశాంగ శాఖ కార్యాలయానికి వచ్చారు. ఆయన వద్ద భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఇది తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేంటని మండిపడింది.

# నేడు కాంగ్రెస్ అభ్యర్థుల ఫైనల్ లిస్ట్

మొదటి పేజీ తరువాయి...



నుంచి పోటీకి సానుకూలత వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆయన పేరును సీఈసీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. నిజామాబాద్ నుంచి సునీల్‌రెడ్డి, దిల్‌రాజు తదితరుల పేర్లు పరిశీలించినా, చివరి కి టి.జీవన్‌రెడ్డి వైపే నేతల మొగ్గు ఉన్నట్లు తెలుస్తోంది. మెదక్ నుంచి బీసీ వర్గానికి చెందిన నీలం మధుకే ఎక్కువ అవకాశాలున్నాయని, ఆయనకు సీఎం వర్గం బలమైన మద్దతు ఇస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఇక భువనగిరి స్థానానికి అభ్యర్థుల ఎంపిక విషయంలో మాత్రం కొంత సందిగ్ధత కనిపిస్తోంది. ఇక్కడి నుంచి సీనియర్ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు కొన్ని పేర్లను ప్రతిపాదిస్తుంటే, ముఖ్యమంత్రి మాత్రం చామల కిరణ్ కుమార్‌రెడ్డి వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఆయనకే టిక్కెట్ దక్కేలా రేవంత్ ఇప్పటికే ఏఐసీసీ కీలక నేతలను ఒప్పించినట్లు తెలుస్తోంది. ఇక ఆదిలాబాద్, హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ స్థానాల్లో ఒకరిద్దరు పేర్లను పరిగణనలోకి తీసుకుని విజయావకాశాల ఆధారంగా అభ్యర్థులను ఫైనల్ చేయనున్నారు. గురువారం జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు. గాంధీభవన్ వేదికగా ఈనెల 29న సాయంత్రం 5 గంటలకు జరిగే టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు, పార్టీ సీనియర్ నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశ ఎజెండాపై చర్చించేందుకు గాను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం సమావేశమయ్యారు. పార్లమెంటు ఎన్నికలు, తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తుక్కుగూడలో వచ్చే నెల ఆరో తేదీన భారీ బహిరంగసభ నిర్వహించేందుకు టీపీసీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ జనజాత ర సభకు రాహుల్, ఖర్గే లాంటి కీలక నేతలు రానుండడం, జాతీయస్థాయి మేనిఫెస్టోను విడుదల చేయనుండడంతో టీపీసీసీ ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసుతో సంబంధం లేదు

మొదటి పేజీ తరువాయి...

ఆరోపణలు చేసిన శరణ్ చౌదరి ఎవరో తెలియదన్నారు. భూదందాలు, కబ్జాలు చేస్తున్నారని భాజపా నుంచి ఆయన్ను తొలగించినట్లు తెలిసిందని చెప్పారు. నకిలీ పత్రాలతో ప్రవాసుల నుంచి డబ్బులు తీసుకొని మోసం చేశారని.. అతడిపై ఎన్నో కేసులు ఉన్నాయన్నారు. అలాంటి వ్యక్తిని ప్రోత్సహించవద్దని ఎర్రబెల్లి కోరారు.

## చేవెళ్ల పార్లమెంట్‌లో గడ్డం రంజిత్ రెడ్డిని

# అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటాం

### కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి. జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి,మార్చి26 (ప్రభాతఉదయం): రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చేవెళ్ల పార్లమెంట్ ఆత్మీయ సమ్మేళనంలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్.జి.రంజిత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇంఛార్జీలతో చైర్మన్లతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ పాల్గొని చేవెళ్ల పార్లమెంట్ లో కాంగ్రెస్ జెండాను ఎగిరేయాలని సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూచేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సుమారు 7.25 లక్షల పైచిలుకు ఓటర్లతో చేవెళ్లలో తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద నియోజకవర్గంగా ఉండగా అసెంబ్లీ ఎన్నికల్లో నాకు అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన రోజే ప్రచారంలో ఇచ్చిన మాట నిలుపుకుంటూ అంగవైకల్యం కలిగిన మహిళకు ఉద్యోగం కల్పించడం ఆయన నిదర్శనన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గారంటీలను అమలుపర్చడం, 60 రోజులలోపే మరో రెండు గారంటీలను అమలు రూపం దాల్చడం వారి పాలనా దక్షతను చాటుతుందని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల పనితీరుకు ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. గతంలో రంజిత్ రెడ్డితో కలిసి పని చేసిన అనుభవం తనకు ఉన్నదని, ఆయన మృదుస్వభావిగా,ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండే వ్యక్తిగా చేవెళ్లలో అందరికి సుపరిచితుడని, ఆలాంటి వ్యక్తిని మనకు లోకసభ అభ్యర్థిగా అందించి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానం నమ్మకాన్ని నిలుపుకునేలా చేవెళ్ల లోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీ అందించేలా కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి తరుపున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేవెళ్లలో భారీ మెజారిటీ అందించాలనే దృఢ సంకల్పంతో ఉన్నారని, ప్రతి నాయకుడు, కార్యకర్త



పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయడానికి పట్టుదలతో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలలో గెలిచి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం కాయంమని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జిగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి చేవెళ్ల పార్లమెంట్ గెలిచి బహుమతిగా ఇస్తామని జగదీశ్వర్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన పిసిసి మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు సదాలక్ష్మి

రాజేంద్రనగర్, మార్చి 26(ప్రభాత ఉదయం) రాష్ట్రం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని పిసిసి మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి మర్యాదపూర్వకంగా స్వగృహంలో మంగళవారం కలిశారు. సీఎం రేవంత్ రెడ్డిని శాలువాతో సదాలక్ష్మి సత్కరించారు.


## నేడు హైకోర్టు నూతన భవనానికి శంకుస్థాపన

### హాజరుకారున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్

బుద్వేల్, మార్చి26(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లో హైకోర్టుకు కేటాయించిన 100 ఎకరాలలో హైకోర్టు భవనం నిర్మించడానికి ఈనెల 27న సాయంత్రం 5:30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయాలకు చెందిన 100 ఎకరాలను హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 55ను విడుదల చేసిన విషయం తెలిసిందే. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్నటువంటి ఈ స్థలంలో హైకోర్టు నూతన భవనాన్ని నిర్మించనున్నారు . ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్ర చూడ్, హైకోర్టు చీఫ్ జస్టిస్ తో పాటు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు హాజరు కానున్నారు.

## బిజెపి చేవెళ్ల పార్లమెంట్ దళిత మోర్చా ఇన్చార్జిగా జోగి రవి

రాజేంద్రనగర్, మార్చి 26(ప్రభాత ఉదయం) భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా చేవెళ్ల పార్లమెంట్ ఇంఛార్జి గా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్ కు చెందిన జోగి రవి ఈ మేరకు బిజెపి దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియమించారు. ఈ సందర్భంగా జోగి రవి మాట్లాడుతూ... రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అత్యధిక మెజారిటీ తో గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కు ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన మాట ప్రకారం పనిచేసి పార్లమెంట్ లో ఉన్న దళిత ఓటర్లకు మోడీ సంక్షేమ పథకాలను వివరించి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తా ,ఎల్లవేళలా ప్రజలకు పార్టీ కి అందుబాటులో ఉంటూ పనిచేస్తానన్నారు.



బిజెపి దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షులను కలిసిన జోగి రవి




సమావేశంలో పాల్గొన్న డాక్టర్ ప్రేమ్ రాజ్

## చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వరరెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలి

బుద్వేల్, మార్చి26(ప్రభాత ఉదయం): భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ కోర్ కమిటీ సమావేశం డివిజన్ అధ్యక్షుడు బాబురావు అధ్యక్షతన మంగళవారం రాజేంద్రనగర్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథి గా రాజేంద్రనగర్ డివిజన్ ఇంచార్జ్ డాక్టర్ ప్రేమ్ రాజ్ యాదవ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ డివిజన్ కమిటీ సమావేశాలు, వివిధ మోర్చాల కమిటీలు సమావేశాలు జరపాలన్నారు. బూత్ కమిటీలు పరిశీలన చేసి లిస్టు తీసుకోవాలన్నారు. బూత్ ల వారిగా లాభార్తి సంపర్క్ అభియాన్ జరపాలన్నారు. ప్రతి బూత్ లో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ లిస్టు వెరిఫికేషన్ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, కోరని సదానంద్, శ్రీనివాస్ గౌడ్ , హరి కిషన్, రాజేంద్రనగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి పసుపుల సందీప్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

## నీతిమంతులను జ్ఞాపకము చేసుకొనుట ఆశీర్వాదము

### కోనేటి ప్రార్ధన మందిరం వ్యవస్థాపకులు రెవరెండ్ ఎస్ సోలోమన్ రాజు జ్ఞాపకార్ధ కుడికలో రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్



దివంగత రెవరెండ్ ఎస్ సోలోమన్ రాజు జ్ఞాపకార్థ కుడిక లో బైబిల్ సందేశాలను విస్తరిస్తున్న రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్



రెవరెండ్ సోలోమన్ రాజు సమాధి వద్ద అభిమానులు



దివంగత రెవరెండ్ ఎస్ సోలోమన్ రాజు సమాధి వద్ద ఆయన భార్య సిస్టర్ ఎస్ యేసుమని, కుమారులు, సంఘ సభ్యులు, బంధువులు

బుద్వేల్, మార్చి26(ప్రభాత ఉదయం) : బుద్వేల్, రాజేంద్రనగర్ ప్రాంతాలలో యేసయ్య రాజ్య సువార్త ను బలంగా జరిగించిన రెవరెండ్ ఎస్ సోలోమన్ రాజు పరలోకంలో దేవుని సన్నిధిలో ఆయనను స్తుతిస్తూ ఉంటారని రాజేంద్రనగర్ మన్నా చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్ అన్నారు. దేవునిలో నిద్రించిన బుద్వేల్ క్రీస్తు గుట్ట కోనేటి ప్రార్ధన మందిరం వ్యవస్థాపకులు రెవరెండ్ ఎస్ సోలోమన్ రాజు జ్ఞాపకార్థ కూడిక మంగళవారం టీచర్స్ కాలనీలోని ఆయన నివాసంలో భార్య సిస్టర్ యేసుమని, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రతుకున్న సమయంలో రెవరెండ్ సోలోమన్ రాజ్ చేసిన పరిచర్యల ను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కుమారులు పాస్టర్ జాషువా, జాన్ వెస్లీ, జాయ్ క్రిస్టినా లతో పాటు బంధువులు, సంఘ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.




## ఎస్. హెచ్ కాన్సెప్ట్ స్కూల్లో సందడిగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

రాజేంద్రనగర్, మార్చి 26 (ప్రభాత ఉదయం): మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ఎస్. హెచ్ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాలలో ప్రి ప్రైమరీ విద్యార్థులు తమ కోర్సు పూర్తి చేసుకుని మొదటి తరగతి కి వెళ్తున్న సందర్భంగా పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పట్టభద్రుల వేషధారణలో ఆకట్టుకున్నారు. చిన్నారులకు సర్టిఫికేట్ అందజేశారు. చిన్నారుల పట్టాదారు వేషధారణలో చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. అందరినీ మంత్రముగ్ధులను చేసే పాటలు మరియు నృత్యాలతో సహా ఆకర్షణీయమైన ప్రదర్శనలతో వేదిక సందడి చేసాయి. చిన్నారుల అభిరుచులను అలవాట్లను గుర్తించి తల్లిదండ్రులూ మరింత ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తారని పాఠశాల కరస్పాండెంట్ బాబురావు అన్నారు. తరగతి గదిలో మరియు వెలుపల విద్యార్థులలో మంచి విలువలను పెంపొందించాలని తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను కోరారు. ప్రతి ఒక్కరికి టాలెంట్ ఉంటుంది, సకాలంలో అవకాశాలు సద్వినియోగం చేసుకుంటే ఫలితాలు వస్తాయన్నారు. పాఠశాల స్థాపించిన సమయం నుండి ఇప్పటివరకు పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన వారికీ ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ సహకారం ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాధవరెడ్డి, సుధాకర్ గౌడ్, ప్రిన్సిపల్ జయశ్రీ, చిన్నారుల ఆట పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఒడిస్సా నుంచి నగరానికి గంజాయిని తీసుకువచ్చిన ఇద్దరి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి




స్వాధీనం చేసుకున్న వాహనాలు

### 30 కిలోల గంజాయి స్వాధీనం

బుద్వేల్, మార్చి26(ప్రభాత ఉదయం): గంజాయి ని స్మగ్లింగ్ చేస్తున్న ముఠాతో పాటు రూ.10.5 లక్షల విలువగల 30 కిలోల గంజాయి ని ఎస్ ఓ టి పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి..... రాజేంద్రనగర్ ఎస్ ఓ టి ఇన్స్పెక్టర్ మరియు అతని బృందం అశోక్ లే ల్యాండ్ ట్రాలీ ఆటో, ఎఫ్ జెడ్ బైక్ పై ప్రయాణిస్తున్న చార్మినార్ ప్రాంతానికి చెందిన అయాన్ అలీ ఖాన్, మొయినుద్దీన్ అనే ఇద్దరు వ్యక్తులను మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో మంగళవారం పట్టుకుని తనఖీ చేయగా ఆటో ట్రాలీ లో లగేజీ బ్యాగులలో దాచిన 15 గంజాయి పాకెట్ల లలో 30 కేజీ ల గంజాయి లభ్యమైంది. విచారణలో ఒడిస్సా కు చెందిన దీపక్ పాటిల్ అనే గంజాయి స్మగ్లర్ నుండి 30 కేజీల గంజాయి ని భద్రాచలం వద్ద కేజీ కి రూ.5 వేల చొప్పున గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. భద్రాచలం నుండి తన ఆటో ట్రాలీలో బయలు దేరారు. ఎన్నికల సందర్భంగా దారిపొడుగునా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద తనఖీలకు దొరకకుండా అతని స్నేహితుడు మొయినుద్దీన్ తన బైక్‌పై భద్రాచలం నుండి హైదరాబాద్ వరకు పైలేటింగ్ చేయగా ఎక్కడా దొరకకుండా తెల్లవారి జామున మైలార్ దేవ్ పల్లి ప్రాంతానికి చేరుకున్నారు. స్మగ్లింగ్ చేసి తీసుకువచ్చిన గంజాయి ని కేజీకి రూ.35 వేల చొప్పున స్థానికంగా చిన్న చిన్న ప్యాకెట్ లు గా మార్చి అమ్ముతున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా రెండు రాష్ట్రాలలో విరివిగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వలన గంజాయి స్మగ్లింగ్ కష్టం అవడం తో కేజీ కి రూ. 25 వేలు అమ్మాల్సిన గంజాయిని రూ. 35 వేలకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. పోలీసులు విచారణ లో మొహమ్మద్ అయాన్ అలీ ఖాన్ పాత నెరస్థుడు అని తెలిసింది. అతని పై ఆరు చైన్ స్నాచింగ్ కేసులు ఉన్నట్లు కనుగొన్నారు. అతని మీద గతం లో హైదరాబాద్ పోలీసులు పీడీ యాక్ట్ కూడా పెట్టడం జరిగింది.

**గంజాయి స్మగ్లర్ల వివరాలు :**

మొహమ్మద్ అయాన్ అలీ ఖాన్ అలియాస్ అయాన్ అని తెలిసింది. ఛార్మినార్ ఈది బజార్, యాకుత్‌పురా, రైల్వే బ్రిడ్జి దగ్గర నివాసముంటాడని కనుగొన్నారు. అలాగే... మహమ్మద్ మొయినుద్దీన్ , ఛార్మినార్ జావీద్ నగర్, తాలబ్‌కట్ట ప్రాంతానికి చెందిన వాడు. ఒడిస్సా కు చెందిన దీపక్ పాటిల్ పరారీలో ఉన్నాడు. వారి నుంచి 30 కేజీల గంజాయి (15 పాకెట్లు ఒక్కొక్కటి 2 కేజీలు) - విలువ రూ.10.5 లక్షలు, అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటో - విలువ రూ.10 లక్షలు, ఒక ద్విచక్ర వాహనం , రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు . వాటి మొత్తం విలువ రూ.22 లక్షలు ఉంటుందన్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నమోదు అయిన ప్రతి కేసులో పారదర్శకంగా విచారణ చేపట్టి నిందితులకు

# శిక్ష పడేందుకు కృషి చేయాలి

### రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి


### జిల్లా సరిహద్దుల్లో అక్రమ మద్యం, ప్రజా పంపిణీ బియ్యం, నగదు రవాణ జరగకుండా ప్రత్యేక నిఘా తో గస్తీ నిర్వహించాలి

### నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రితిరాజ్,



జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎస్పి రుతిరాజ్

గద్వాల్ జిల్లా ప్రతినిధి, మార్చి 26(ప్రభాత ఉదయం): నమోదు అయిన ప్రతి కేసుల్లో ఎస్ ఓ పి ప్రకారం పకడ్బందీ గా విచారణ చేపట్టాలని, అందుకు అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి సాంకేతికతను ఉపయోగించి చార్జి షీట్ ఫైల్ చేసి నిందితులను శిక్షలు పడేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ రితిరాజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమీక్ష సమావేశం హాలు నందు జిల్లా పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ గారు నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.నేర సమీక్ష లో ఆయా పోలీస్ స్టేషన్ లలో నమోదు అయిన గ్రేవ్ కేసులను పరిశీలించారు, ఆయా కేసులలో విచారణలో అదికారులు సేకరిస్తున్న ఆధారాలను పరిశీలించారు. యక్సిడెంట్ కేసులలో గుర్తించబడని డెడ్ బాడి లకు పోలీస్ అదికారులు ఏలాంటి విచారణ కొనసాగిస్తున్నారో పరిశీలించి అట్టి వాటిని త్వరగా గుర్తించేందుకు పక్కా పోలీస్ స్టేషన్ లలో మిస్సింగ్ కేసుల వివరాలు తెలుసుకోవడం , వెబ్ సైట్ లో పోటోలు అప్లోడ్ చేయడం తదితర అంశాల గురించి తగు సూచనలు చేశారు. యాక్సిడెంట్స్ కు సంబందించి పోతోగ్రఫి తీసుకోవడం, సిడిఎఫ్ ను డీటైల్స్ మ్యాప్ చేయలని సూచించారు,ప్రాపర్టీ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేస్తున్న విధానం ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ పి రితిరాజ్ మాట్లాడుతూ... రాబోయే పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల సంఘం సూచనల ప్రకారం బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలియజేసారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక వ్యక్తుల,రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రజలంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించే విధంగా పనిచేయాలని తెలిపారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమ మధ్య%శీ%,నగదు రవాణాను నిరోధించడంలో భాగంగా చెక్ పోస్ట్ లలో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే సరి హద్దు రాష్ట్రాల పోలీస్ అధికారులతో కాంటాక్ట్ లో ఉంటూ అక్రమ రవాణాను సంబందించిన సమచారం షేర్ చేసుకోవాలని, సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా పరిమితికి మించి నగదును రవాణా చేస్తూ పట్టుబడితే ఎన్నికల నియమావళి ప్రకారం కేసుల నమోదు చేసి సీజ్ చేసిన నగదును డిస్ట్రిక్ట్ రిడ్రీసల్ కమిటీకి అప్పగించాలని తెలిపారు. ఎన్నికల సందర్భంగా మధ్యం , నగదు అక్రమ రవాణ జరగకుండా ప్రత్యేక గస్తీ నిర్వహించి నిఘా ఉంచాలని అన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాప్స్ లేకుండా చూడాలని అన్నారు. గ్రేవ్ కేసులలో బెయిల్ పై వచ్చిన నిందితులు ప్రస్తుత ఎక్కడెక్కడ ఉన్నారు ఏమీ చేస్తున్నారు అనే విషయాలను గమనిస్తూ ఉండాలని, వారి పై షీట్స్ ఓపెన్ చేయలని ఆదేశించారు. ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు.కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జాతీయ రహదారి నుండి గ్రామాలకు వెళ్లే అప్రోచ్ రోడ్ల దగ్గర గ్రామస్థులతో మాట్లాడే లైటింగ్స్ ఏర్పాటు చేయించాలని, అలాగే హై వే అథారిటీ వారితో మాట్లాడి అప్రోచ్ రోడ్డు డివైడర్ పై లైటింగ్ ఏర్పాటు చేయించాలని సూచించారు. గ్రామాలలో, పట్టణ కాలనీలలో ప్రజలతో కమ్యూనిటీ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించి సీసి కెమెరాల ప్రాముఖ్యతను తెలియజేసి సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకునే టట్లు ప్రోత్సహించాలని ఆదేశించారు. దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు.సైబర్ నేరాలకు సంబంధించి సాక్ష్యాధారాలను సాంకేతికతను ఉపయోగించి సైబర్ వారియర్స్ సపోర్ట్ తిసుకొని సైబర్ నేరగాళ్ళ ఖాతాలలో ఉన్న నగదును పుట్ ఆన్ హోల్డ్ లో ఉంచి కోర్టు లో కేసు ఫైల్ చేయలని, .అట్టి నగదును కోర్టు ద్వారా కొన్ని మార్గనిర్దేశాలతో భాదితులకు అందజేయలని, నిందితులకు పి టి వారెంట్ ఎక్సిక్యూట్ చేయలని సూచించారు. పోలీస్ స్టేషన్ ల వారిగా నియమించిన సైబర్ వారియర్స్ సైబర్ నేరం జరిగిన నట్లు బాధితులు పోర్టల్ లో పిర్యాదు చేసిన వెంటనే నిందితుల ఖాతాలను గుర్తించడం ,సంభందిత బ్యాంక్ అధికారులతో మాట్లాడి వారి అకౌంట్ ఫ్రీజింగ్ చేయడం వంటివీ అప్డేట్ చేస్తూ ఉండాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. నమోదు అయిన కేసులలో విచారణ పారదర్శకంగా చేపట్టి ఫైల్ చేయలని, కోర్టు ట్రయల్స్ సమయంలో సాక్షులను బ్రీఫ్ చేయడం, అవసరము అయిన సాక్ష్యాధారాలను సమర్పించడం ద్వారా నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్ పి కె.గుణ శేఖర్ , డి.ఎస్ పి కె.సత్యనారాయణ , ఎస్ బి ఇన్ స్పెక్టర్ జములప్ప , గద్వాల్, ఆలంపూర్ , శాంతి నగర్ సిఐ లు భీష్మ కుమార్, రవి బాబు, కె. ఎస్. రత్నం, సైబర్ వింగ్ ఇన్స్పెక్టర్ రాజు, సీసీ ఎస్ ఇన్స్పెక్టర్ వేంకటేశ్వర్ రెడ్డి, జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ ల ఎస్సై లు , డిసి ఆర్బి, ఐటీ, విభాగాల ఎస్సై లు పాల్గొన్నారు.



## మల్కాజ్గిరి పార్లమెంటు అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలి

### కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జి బండి రమేష్

కూకట్పల్లి,మార్చి26 (ప్రభాత ఉదయం): మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ అన్నారు. నియోజకవర్గంలోని కె పి హెచ్ బి కి చెందిన ఎస్ ఎల్ ఎఫ్ లీడర్ సుందరి తన అనుచరులు 30మందితో కలసి కాంగ్రెస్ నాయకురాలు రజిత అద్వర్యంలో బాలానగర్ పార్టీ కార్యాలయంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మహిళలకు కాంగ్రెస్ పార్టీ కండువా వేసి స్వాగతించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పని చేసి అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవా లన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనకు ఆకార్షితులై పార్టీలో చేరిన మహిళలకు మరోసారి స్వాగతం పలుకుతునన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## భూమిపై గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చిత్రాన్ని గీసిన గద్వాల మెగా ఫ్యాన్స్

### డస్ట్ ప్రత్యేక రంగులతో మెగా పవర్ స్టార్ చిత్రం

గద్వాల,మార్చి26(ప్రభాత ఉదయం) గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని జోగులాంబ గద్వాల జిల్లా మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు బోయ జమ్మన్న ఆధ్వర్యంలో గద్వాల జిల్లా కేంద్రంలోని రాయచూరు రోడ్డు సమీపంలో డస్ట్ తో ప్రత్యేక రంగులతో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చిత్రాన్ని వేశారు. రెండు యూనిట్లు దస్టు ప్రత్యేక రంగులతో దాదాపు 450 ఫీట్లు పొడవు 250 ఫీట్లు అడ్డంతో జనసేన అధ్యక్షుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చిత్రాలను ఎంతో అద్భుతంగా గద్వాల మెగా ఫ్యాన్స్ తీర్చిదిద్ది రామ్ చరణ్ కు వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గద్వాల మున్సిపల్ చైర్మన్ బి.యస్. కేశవ్ తో 6 రోజుల ముందే అక్కడ కేక్ కట్టింగ్ చేయించి రామ్ చరణ్ కు అడ్వాన్స్ గా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గద్వాల మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు బోయ జమ్మన్నను చైర్మన్ బీఎస్ కేశవ్ అభినందించారు. రామ్ చరణ్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తులో మరెన్నో విజయాలు అవార్డులు అందుకోవాలని మనస్ఫూర్తిగా భగవంతుడుని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జమ్మన్న మాట్లాడుతూ... గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కు జన్మదిన సందర్భంగా 6 రోజుల ముందే జన్మదిన సంబరాలు మొదలయ్యాయని తెలిపారు. ప్రతి సంవత్సరం మెగాస్టార్ చిరంజీవి,పవర్ స్టార్ పవన్ కళ్యాణ్,రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను గత 10 ఏండ్ల నుండి చేపడుతున్నామని జమ్మన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.కోటేష్ నాగులుయాదవ్,వినోద్ కమ్మరిరాము జిల్లా మెగా ఫ్యాన్స్ ప్రధాన కార్యదర్శి రఘు గంజిపేట పరుశరామ్ గొనెగండ్ల జగదీష్, వడ్డేకృష్ణ,సత్యం, వెంకటేష్, సాంబ, సురేష్, శ్రీనివాసరావు, భీమేష్, శ్యామ్, రవి, నాగరాజు, మరియు మెగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్, బీజేపీ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

### దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో చేరిన వివిధ పార్టీల నాయకులు





బిజెపి, బిఆర్ఎస్ నాయకులకు పార్టీ కండువా కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర,మార్చి26(ప్రభాత ఉదయం) చిన్న చింతకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు చింతల ముని, శివకుమార్ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ పెంటన్న, వర్నేల్, అంజి, పలువురు బిఆర్ఎస్ నాయకులు, యువకులు, మహిళలు ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కురుమూర్తి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు ఉద్దాల కురుమూర్తి, కొన్నూరు గోవింద్, బాలస్వామి, కోట్ల రాములు, గోపి, గోవిందు తదితరులు మరియు మహేందర్, దాసన్న, కురుమన్న, ఉత్తన్న, దాసరి బాలస్వామి, లింగన్న ,బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున స్థానిక , మండల నాయకులు ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బిజెపి , బి ఆర్ ఎస్ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా జియంఆర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. మహబూబ్ పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు అభ్యర్థి వంశీచందర్ రెడ్డి గెలిపే లక్ష్యంగా పనిచేయాలన్నారు



## ఉపాధి కూలీలకు వసతులు కరువు

గద్వాల,మార్చి26(ప్రభాత ఉదయం)పల్లెల్లో కూలీల వలసల ను నివారించడంతో పాటు వారికి పని కల్పించి చేసిన పనికి తగినట్లుగా వేతనాలు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రారంభంలో దశల వారీగా కూలీలకు గడ్డపారలు, మెడికల్ కిట్లు, టెంట్లు(గుడారాలు), తాగు నీరు లాంటి వసతులను కల్పించినప్పటికీ రాను రాను వారికి ఎలాంటి సదుపాయాలను కల్పించడం లే దు.ఇది వరకు కూలీలు సొంతంగా గడ్డపార సమకూర్చుకుంటే రోజుకు రూ. 10, తాగు నీటి కోసం రూ.5అందజేసే వారు. కనీసం ఇప్పుడు పని ప్రదేశం లో కనీస వసతులు లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. వేసవిలో మార్చి నుంచి జూన్ వరకు కూ లీలకు వడదెబ్బ తగలకుండా నీడకోసం టెంట్లు వేసి రక్షణ కల్పించాల్సి ఉంటుంది. అలసటగా ఉంటే పొదలు, చెట్ల చాటున సేద తీర్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కనీసం నీటిని సరఫరా చేయడానికి ఒక మేట్ను నియమిస్తే కూలీలకు సౌకర్యంగా ఉం టుంది. జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు వసతు లు లేకపోవడంతో ఎండలోనే సేద తీరుతున్నారు. కూలీలకు భోజనం చేయడానికి, అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి ప్రభుత్వం గతంలో గుడారాలు, మెడికల్ కిట్లు పంపిణీ చేసేది. వాటిని క్షేత్ర సహాయకులు ప్రతీ రోజు పని ప్రదేశానికి తీసుకువెళ్లి వసతి కల్పించేవారు. ఆరు నుంచి ఏడు సంవత్సరాలుగా గుడారాలు, మెడికల్ కిట్లు ఇవ్వడం మరిచారు. కిట్టులో అయోడిన బాటిల్, బ్యాండేజి, దూది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొన్ని రకాల మాత్రలు ఉండేవి. కూలీలకు వీటి ని కూడా ఏళ్ల తరబడి సమకూర్చడం లేదు. పనికి ఉపయోగించే పరికరాలు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కిట్లు, గుడారాలు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.

## ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి




గద్వాల,మార్చి26(ప్రభాత ఉదయం) జిల్లాలోని గ్రామపంచాయతీలలో గ్రామీణ ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులను ప్రారంభించలేదని వెంటనే ప్రతి గ్రామపంచాయితీలో పనులను ప్రారంభించి పెండింగ్ లో ఉన్న బిల్లులను కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్రామాలలో గత రెండు సంవత్సరాల నుంచి కూడా పెండింగ్ బిల్లులు రాలేదని అన్నారు. పని ప్రదేశాలలో కూలీలకు టెంటు, మంచినీటి సౌకర్యము, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స పెట్టే వంటి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల కూలీలు వడదెబ్బకు గురి అయ్యి తీవ్ర అనారోగ్యల పాలౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలు తమ సంపాదించిన మొత్తాన్ని ఆసుపత్రులకే ఖర్చు చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీలో పని చేసే ప్రతి కూలికి కొలతలతో సంబంధం లేకుండా కనీస కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యవసరల ధరలను బేరిజు వేసుకొని చూసుకుంటే కనీస వేతనం రూ.600 ఉంటేనే వారి అవసరాలు తీరుతాయని అన్నారు. అదే సందర్భంలో పని ప్రదేశాలలో ప్రభుత్వమే పరికరాలు అందించాల్సి ఉండగా పరికరాలను సైతం కూలీలే సొంతంగా తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తెచ్చుకున్న పరికరాలకు ప్రభుత్వం అదనంగా డబ్బులు అందజేయాల్సి ఉన్న ఇవ్వటం లేదన్నారు. ఉపాధి హామీ పనుల సందర్భంగా అదనంగా భత్యాన్ని ఇవ్వాల్సి ఉండగ ఇవ్వవలసిన బత్యాన్ని సైతం పెండింగ్లో పెడుతున్నారని అన్నారు ఉపాధి హామీకి అరకొర నిధులు కేటాయించి కూలీలతో మాత్రం నిరంతరం పనులు చేయిస్తూ వారికి కూలీలు ఇవ్వకుండా వేధించడం సరైనది కాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక కూలీలు ఉపాధికి వెళ్తున్నారని పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా వారికి పరికరాలు అందించకుండా ఏ విధంగా ఉపాధి హామీ పథకం విజయవంతం అవుతుంది అని ప్రశ్నించారు. పనులు కల్పించాల్సిన అధికార యంత్రాంగము క్షేత్రస్థాయిలో కూలీలు పనులు అడిగిన కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఉపాధి హామీలో పని చేసే ప్రతి ఒక్కరికి జాబ్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు, పట్టణ ప్రాంతాల్లో కూడా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి పథకంలో పని దినాల సంఖ్యను వంద నుంచి 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి నరసింహ, ఉప్పేరు నరసింహ, సవారన్న తదితరులు పాల్గొన్నారు.



## గద్వాల్ జిల్లా వాసికి డాక్టరేట్

గద్వాల,మార్చి26(ప్రభాత ఉదయం)జన్యు శాస్త్రంలో చేసిన పరిశోధనలకు గాను జోగుళాంబ గద్వాల్ జిల్లా వాసి సుధారాణికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. గద్వాల్ మండలం మేలచెర్వు గ్రామానికి చెందిన భాగ్యమ్మ మరియు ఏసేపుల రెండో కుమార్తె కే సుధారాణి, ఉస్మానియా యూనివర్సిటీలోని జన్యు శాస్త్ర విభాగంలో క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఫైటో ఎక్స్ట్రాక్ట్ ఫర్ యాంటీ ఏపిలెప్టిక్ యాక్టివిటీ ఆఫ్ అకాలిఫా ఇండికా అనే అంశంపై పరిశోధనలు జరిపి ఔషధ మొక్కల ప్రాముఖ్యత, మూర్ఛ వ్యాధిని తగ్గించుటలో వాటి ప్రాధాన్యతలపై పరిశోధనలు చేసి, వాటిని మూర్ఛ వ్యాధి వచ్చిన ఎలుకలపై ప్రయోగించి జన్యుపరమైన మార్పులు గమనించినట్లు, సుధారాణి తన పరిశోధన గ్రంథంలో సమర్పించారు. ఇందుకుగాను, ఉస్మానియా యూనివర్సిటీ వారు ఆమెకు డాక్టరేట్ ప్రకటించింది. సుధారాణికి డాక్టరేట్ రావడం వల్ల పరిశోధన విద్యార్థులు తల్లిదండ్రులు బంధుమిత్రులు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సుధారాణికి డాక్టరేట్ వచ్చిన సందర్భంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం అభినందించారు. ఈ సందర్భంగా సుధారాణి తన పరిశోధనలకు సహకరించిన ప్రొఫెసర్ రోజా రాణి కి పరిశోధక విద్యార్థులకు తన చదువులో ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.


Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.